లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

• కేంద్ర కార్మిక సంఘాలు, రైతు ,వ్యవసాయ కార్మిక సంఘాల నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త నిరసనలలో భాగంగా లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, రైతుల పండించిన పంటకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయించాలనే ప్రధాన డిమాండ్లతో కర్నూలు నగరంలోని జిల్లా పరిషత్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు కేంద్ర కార్మిక సంఘాలు రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్ర మానికి ఎఐటియుసి నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, సిఐటియు ఓల్డ్ టౌన్ కార్యదర్శి విజయ్ అధ్యక్షత వహించారు. ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి జె. లలితమ్మ, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్. రాధాకృష్ణ, ఎస్.మునెప్ప మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌ల వలన కార్మిక వర్గం కనీస వేతనం ,ఉద్యోగ భద్రత, ఎనిమిది గంటల పని విధా నం ,సమ్మె హక్కు కోల్పోయేటు వంటి పరిస్థితి ఏర్పడిందని ,తక్షణమే లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో పనిచేసే స్కీం వర్కర్లను గౌరవేతనం పేరుతో వారి శ్రమను దోచుకుంటున్నారని తక్షణమే ఆశ, అంగన్వాడి, మధ్యాహ్న భోజనం, కార్మికులు, స్కూల్ ఆయాలను, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యో గులుగా గుర్తించి కార్మిక చట్టాల ప్రకారం కనీస వేతనం పిఎఫ్, ఇఎస్ఐ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. గ్రాడ్యుటీ అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ పేరుతో దేశ సంపదను కార్పొరేట్లకు అప్పజెప్పాలని ప్రయత్నం చేస్తుందని, తక్షణమే ప్రభుత్వరంగ సంస్థలను. ప్రభుత్వ రంగంలోనే కొన సాగించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు విధానాన్ని రద్దుచేసి కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. అసంఘటిత రంగంలో ఉన్నటువంటి ఆటో, హమాలి ,వ్యవసాయ కార్మికు లకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని తీసుకురావాలన్నారు. కేంద్ర బడ్జెట్లో మూడు శాతం నిధులు కేటాయించాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. జగన్నాథం మాట్లా డుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నల్ల చట్టాలను రద్దు చేస్తా నని, స్వామినాథన్ సిఫార సులు అమలు చేస్తానని, రైతుల పండించిన పంటలకు కనీసం మద్దతు ధర చట్టాన్ని చేస్తామని చెప్పి మాట తప్పాడని విమర్శించారు. తక్షణమే కనీస మద్దతు ధర చట్టాన్ని తీసు కురావాలన్నారు. దానికి చట్టబద్ధత కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పని చేసే కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. రోజు కూలి రూ.600 పెంచాలని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు సుంకన్న, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు సురేష్ నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, మహేష్ ,ఎఐటియుసి నగర డిప్యూటీ కార్యదర్శి టి. రామాంజనేయులు, ఈశ్వర్, నల్లన్న, మహేష్, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు రమజాబి, రేణుక, రాము, నాగరాజు, రైతు జిల్లా సహా య కార్యదర్శి దంబోలా శ్రీనివాసరావు, రబియా సి.ఐటియు నగర నాయకులు నరసింహులు, సాయిబాబా, అబ్దుల్లా, ప్రభాకర్, హుస్సేన్,రాధా కృష్ణ, రవి,మైమూద్,కష్ణ,సుధాకరప్ప, ఐఎఫ్‌టియు నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

నిరసననుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

జూన్ 21 వరకు యోగాంధ్ర క్యాంపెయిన్

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈనెల 21 నుండి జూన్ 21 వరకు యోగాంధ్ర క్యాంపెయిన్ కార్యక్రమం జిల్లాలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు.. మంగళవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 21న అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని, అందుకు అనువైన స్థలాన్ని గుర్తించాలని కర్నూలు మున్సిపల్ కమిషనర్, అడిషనల్ ఎస్పీని ఆదేశించారు. జూన్ 21న యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21నుంచి యోగాంధ్ర క్యాంపెయిన్ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు.. అందులో భాగంగా మే 21న జిల్లా స్థాయిలో కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని నిర్వహించాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్, డిఎంహెచ్వో ను ఆదేశించారు.. యోగాంధ్ర క్యాంపెయిన్ లో భాగంగా యోగా శిక్షకులకు శిక్షణ, ప్రజల్లో అవగాహన ముఖ్యాంశాలుగా ఉన్నాయన్నారు. శిక్షణ కోసం మండలానికి ఒక ట్రైనర్ ఆఫ్ ట్రైనర్‌లను, అర్బన్ లో 4 వార్డులకు కలిపి ఒక ట్రైనర్ ఆఫ్ ట్రైనర్‌లను గుర్తించి, జాబితాను సాయంత్రానికి ఇవ్వాలని కలెక్టర్ డిఎస్‌డిఒను ఆదేశించారు. యోగాకు సంబంధించిన పాటల పోటీలు, యోగా పెయింటింగ్ పోటీలు, యోగా వ్యాస రచన పోటీలను పాఠశాలల్లో, కళాశాలలో, యూనివర్సిటీ లలో, నిర్వహించాలని కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారి, ఇంటర్మీడియట్ ఆర్ఐఒ, సెట్కూరు సిఇఒలను ఆదేశించారు. జిల్లా స్థాయిలో ప్రజలకు యోగా పై అవగాహన కల్పించేందుకు మే 27న ర్యాలీలను నిర్వహించాలన్నారు. యోగాలో పాల్గొనే వారితో రిజిస్ట్రేషన్లు చేయించాలని, ప్రజలు యోగా కార్యక్రమాల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్, అదనపు ఎస్పీ హుస్సేన్ పీరా, కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, డిఎంహెచ్ఓ డాక్టర్ శాంతి కళ, డిఆర్‌డిఎ పిడి రమణా రెడ్డి, మెప్మా పిడి నాగశివ లీల, యోగా అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

- పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత - మినీ మహానాడు దిగ్విజయం

మాట్లాడుతున్న గౌరు వెంకట్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా ఎన్డీయే ప్రభుత్వం ముందుకు సాగుతోందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత రెడ్డి తెలిపారు. పాణ్యం నియోజకవర్గ టిడిపి మినీ మహానాడు కల్లూరులోని ఎఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి , సంక్షేమం రెండు కళ్ళుగా ఎన్డీయే ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి కషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. టిడిపి నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌరు వెంకట రెడ్డి మాట్లాడుతూ రాబోయే కడప జిల్లా మహానాడుకు కార్యకర్తలు భారీగా తరలిరావాలని ఆహ్వానించారు.

బాధిత రైతుకు సహాయం: కల్లూరు మండలం కొంగనపాడుకు చెందిన టిడిపి మాజీ సర్పంచి రైతు నాగయ్య మిరప పంటను వైసిపి కార్యకర్తలు నిప్పంటించడంతో రూ. 30 లక్షల నష్టం జరిగింది. ఎమ్మెల్యే చరిత రెడ్డి చంద్రబాబు నాయుడు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లగా, ఆయన రూ. 10 లక్షల నష్టపరిహారాన్ని మంజూరు చేశారు. ఈ చెక్కును మినీ మహానాడు వేదికపై గౌరు దంపతులు నాగయ్యకు అందజేశారు. టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, పాణ్యం నియోజకవర్గ పరిశీలకులు గాజుల ఆదెన్న, నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు కల్పతరువు.. జిల్లా కేంద్ర గ్రంథాలయం...

- అందుబాటులో అన్ని పోటీ పరీక్షలకు మెటీరియల్ - కొరవడిన ప్రభుత్వ ప్రోత్సాహం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లా కేంద్ర గ్రంథాలయం నిరుద్యోగ యువతకు ఒక ముఖ్యమైన ఆధారం. గ్రంథాలయం డిఎస్‌సి, పోలీస్, గ్రూప్స్, బ్యాంక్ కోచింగ్ వంటి పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచుతోంది. దాతల సహకారంతో దాదాపు 30,000 విలువైన పోటీ పరీక్షల పుస్తకాలను సమకూర్చారు. గ్రంథాలయాలు ప్రజలకు జ్ఞానాన్ని అందించడంలో, చైతన్యం చేయడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయి. వేసవిలో విద్యార్థుల కోసం ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌లను నిర్వహించి, వారికి కథలు, చదవడం, జనరల్ నాలెడ్జ్, ఇంగ్లీష్ గ్రామర్, సైన్స్, గణితం, చిత్రలేఖనం వంటి వాటిలో శిక్షణ ఇస్తున్నారు. గ్రంథాలయాల వల్ల అనేకమంది నిరుద్యోగులు ఉద్యోగాలు సంపాదించారు. అయితే, గ్రంథాలయానికి ప్రభుత్వ శాఖల నుండి కోట్ల రూపాయల బకాయిలు రావాల్సి ఉంది. దీనివల్ల నిర్వహణ కష్టంగా మారింది. జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, కమిషనర్లు ఈ బకాయిలు వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మొత్తానికి, కర్నూలు జిల్లా గ్రంథాలయం నిరుద్యోగులకు ఒక విలువైన వనరుగా ఉంది. సరైన ఆర్థిక సహకారం ఉంటే మరింత మందికి ఉపయోగపడుతుంది.

చదువుకుంటున్న అభ్యర్థులు

కొంతమంది నిరుద్యోగుల అనుభవాలు:

సుమిత్ర: ఎంఎ, టిపిటి చదివి టీచర్‌గా పనిచేసినప్పటికీ తక్కువ వేతనంతో ఇబ్బంది పడ్డారు. డిఎస్‌సి కోసం ప్రిపేర్ అవుతున్నారు. గ్రంథాలయానికి వచ్చి చదువుకుంటున్నారు. తప్పకుండా ప్రభుత్వ టీచర్ ఉద్యోగం సాధిస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రసూన: ఇంటర్ పూర్తి చేసి ఎంసెట్ కోసం ప్రిపేర్ అవుతున్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల కోచింగ్‌కు వెళ్లలేక గ్రంథాలయంలో చదువుకుంటున్నారు. ఎంసెట్‌లో మంచి ర్యాంకు సాధించి ప్రభుత్వ సీటు తెచ్చుకుంటానని నమ్మకంగా ఉన్నారు.

హీరా కుమారి: బిఎస్‌సి కంప్యూటర్స్ డిగ్రీ పూర్తి చేసి పోలీస్ కావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒక సంవత్సరం నుండి గ్రంథాలయానికి వచ్చి చదువుతున్నారు. ఇక్కడ అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, ఉద్యోగం సాధించి నిరుద్యోగులకు ఆదర్శంగా నిలుస్తానని చెప్పారు.

ఠాగూర్: డిగ్రీ పూర్తి చేసి పోలీస్ సెలక్షన్లలో ఎంపికయ్యారు. రాత పరీక్షల కోసం గ్రంథాలయంలో చదువుకుంటున్నారు. గ్రంథాలయంలో పేద నిరుద్యోగుల కోసం అన్ని రకాల పుస్తకాలు ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు.

జులై 2 నుంచి విమాన సర్వీసు ప్రారంభం

- మంత్రి టిజి భరత్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నుండి విజయవాడకు జులై 2 నుండి విమాన సౌకర్యం ప్రారంభమవుతుందని రాష్ట్ర పరిశ్రమల మంత్రి టిజి భరత్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతానికి సోమవారం, బుధవారం, శుక్రవారాల్లో ఈ సర్వీసు నడుస్తుందన్నారు. త్వరలో ప్రతి రోజూ ఈ విమాన సర్వీసు నడుపుతామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చెప్పినట్లు మంత్రి టిజి భరత్ తెలిపారు. ఓర్వకల్లు పారిశ్రామికాభివృద్ధిలో విమాన సర్వీసు ఎంతో కీలకమన్నారు.

భూ రీసర్వేను క్షేత్రస్థాయిలో చేపట్టాలి

ప్రజాశక్తి - సి బెళగల్ : సి బెళగల్ మండలం భూ రీ సర్వేను క్షేత్ర స్థాయిలో చేపట్టాలని ఆర్‌డిఒ కిడారి సందీప్ సర్వే బృందాలకు సూచించారు. మంగళవారం బ్రాహ్మణ దొడ్డిలో తహసీల్దార్ పురుషోత్తం సమక్షంలో మండల సర్వేయర్ నాగభూషణం, విఆర్‌ఒలు శేఖర్, రమణ, తదితరులు భూ రీసర్వే చేపట్టారు. ఇందులో భాగంగా ఆర్‌డిఒ కిడారి సందీప్ పర్యవేక్షణ చేపట్టి క్షేత్ర స్థాయిలో చేపట్టాలని రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా శాశ్వత పరిస్కారం అయ్యేలా దృష్టి సారించాలని అన్నారు. మండలంలో సర్వేను ముమ్మరం చేయాలని ముందుగా రైతులకు సమాచారం అందవేసి సంతృప్తి చెందేలా విధులు నిర్వహించాలని కోరారు.

వ్యవసాయ మార్కెట్‌లో డ్రగ్స్‌పై అవగాహన

డ్రగ్స్‌పై పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వ్యవసాయ మార్కెట్ యార్డు అధికారులు

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

ఈగల్ ఐ.జి ఆకే రవి కష్ణ ఆదేశాల మేరకు కర్నూల్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ నందు పని చేయుటకు వచ్చిన జిల్లాలో నలుమూలల ఉన్న కూలీలతో, అంతర్రాష్ట్ర ఎగుమతి, దిగుమతి చేస్తున్న డ్రైవర్లతో, డ్రగ్స్ మీద మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ అవగాహన కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఎంపిక శ్రేణి కార్యదర్శి ఆర్ జయలక్ష్మి,ఈగల్ ఎస్ ఐ కె. సుజన్ కుమార్, మార్కెట్ అసిస్టెంట్ కార్యదర్శి కె. వెంకటేశ్వర్లు కమిషన్ దారులు శేషగిరి శెట్టి, ఈగల్ సిబ్బంది వై ఎలీషా, ఫర్హాత్, రమేష్ లు పాల్గొన్నారు. సదస్సులో సుజన్ కుమార్ మరియు శేషగిరి శెట్టి మాట్లాడుతూ శరీరాన్ని బలహీనంగా మారి నిరుత్సా హంగా ఉంటారని, పనిలో చురుకుదనం తగ్గుతుందని, కుటుంబ జీవితం ఆర్థికంగా ఇబ్బంది పడుతుందని వివరించారు. డ్రగ్స్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

సచివాలయ ఉద్యోగిని పరామర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నన్నూరు గ్రామ సచివాలయ ఉద్యోగి ముకుందా ప్రియను మంగళవారం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పరామర్శించారు. నన్నూరు టోల్గేట్ హైవే వద్ద రోడ్డు ప్రమాదానికి గురైన సచివాలయ ఉద్యోగిని ముకుందా ప్రియ వైద్య చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని సచివాలయ ఉద్యోగికి మెరుగైన వైద్యం అందించాలని సూపరిండెంట్ డాక్టర్‌కె.వెంకటేశ్వర్లును ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట టిడిపి సీనియర్ నాయకులు విశ్వేశ్వర్ రెడ్డి, గ్రామ నాయకులు తదితరులు ఉన్నారు.

'తల్లి బిడ్డ' ఎక్స్ ప్రెస్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

• సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకష్ణ డిమాండ్

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

హాస్పటళ్లలో ప్రసవించిన తల్లులు , వారి పిల్లలను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరుస్తున్న తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ వాహన డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్. రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ డ్రైవర్లు , ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో కర్నూలులోని కృష్ణదేవరాయ సర్కిల్ ధర్నా చౌక్ వద్ద ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షకు ముందు డ్రైవర్లందరూ ర్యాలీగా జిల్లా కలెక్టరేట్‌కు చేరుకొని కొద్దిసేపు ఆందోళన చేశారు. కర్నూల్ డిఆర్‌ఒకు వినతి పత్రం సమర్పించారు. డ్రైవర్లకు కనీస వేతనం రూ.18,000 అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పని భద్రత కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎనిమిది గంటల పని విధానం అమలు కావడం లేదని, ప్రభుత్వ సెలవులు కూడా వర్తించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే తమ సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పిఎస్.రాధాకృష్ణ, సిఐటియు న్యూ సిటీ కార్యదర్శి సిహెచ్ సాయి బాబా, ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌ఫోర్టు వర్కర్స్ ఫెడరేషన్ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్ లు నిరాహార దీక్షకు కూర్చున్న వారికి పూలమాలలు వేసి దీక్షను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ డ్రైవర్ యూనియన్ సిఐటియు అనుబంధ జిల్లా కార్యదర్శి నరేష్, ఉపాధ్యక్షులు పవన్ కుమార్, కిరణ్, సురేష్, చిరంజీవి, కోశాధికారి నరేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి : ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి - కర్నూల్ కలెక్టరేట్

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ప్రభుత్వ రంగంలో పనిచేసే కార్మికులకు కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలి. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి. నాగన్న, సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్. షాజహాన్ , జి. శ్రీధర్ డిమాండ్ చేశారు. రైతు , కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఓర్వకల్ ప్రజా సంఘాల కార్యాలయం నుండి తహశీల్దార్ ల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కార్మికులకు 200 రోజులు పని కల్పించాలని, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. సాగు చేసుకుంటున్న పేదలందరికీ పట్టా పాస్ పుస్తకాలు మంజూరు చేయాలన్నారు. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల రైతులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు నెరవేర్చడం లేదని విమర్శించారు. తమ డిమాండ్లను నెరవేర్చకపోతే కార్మికులు , రైతులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ మండల నాయకులు రామకృష్ణ, ప్రజా సంఘాల నాయకులు మల్లేష్, చాంద్ బాషా, మహేష్, మాసుంబాష, బషీర్, మురళి, కేశాలు, ఎల్లరాజు, లక్ష్మీదేవి, శ్రీరాములు, హమాలి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు : కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను అమలు చేయాలని, కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సిఐటియు డిమాండ్ చేస్తోంది. గూడూరు పట్టణంలో ఉపాధి హామీ పథకం అమలు చేయాలని కూడా సిఐటియు డిమాండ్ చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం కార్మికుల పట్ల వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని, కార్మిక చట్టాలను కుదించిందని సిఐటియు విమర్శించింది. ప్రభుత్వ , ప్రైవేట్ రంగాలలో పనిచేసే కార్మికులకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతుంది. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించడం వల్ల కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు నాయకులు జె.మోహన్, ఇతర కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. వారు కార్మికుల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

కోడుమూరు :ఉపాధి పనులకు నిధులు పెంచాలని కోడుమూరులోని సిఐటియు, ఎఐటియుసి, అంగన్వాడి, ఆశా, ఆటో, హమాలి, గ్రామపంచాయతీ, చేనేత కార్మికుల ఆధ్వర్యంలో కోట్ల విజయభాస్కర్ రెడ్డి సర్కిల్‌లో ఈ నిరసన తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి జిపి. వీరన్న, ఎఐటియుసి మండల కార్యదర్శి మద్దూర్ రాముడు, సిపిఎం మండల కార్యదర్శి కె. రాజు, సిపిఐ మండల కార్యదర్శి బి. రాజు, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కె. లక్ష్మన్న మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు మరియు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని, 200 రోజులు పని కల్పించి రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలన్నారు. పెట్టుబడిదారుల కోసం తెచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలన్నారు.

ఓర్వకల్లులో మాట్లాడుతున్న జి.రామకృష్ణ

గూడూరు

కోడూమూరు

లింగ నిర్ధారణ చేస్తే చర్యలు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-పత్తికొండ

ప్రైవేట్ ఆసుపత్రిలో లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే , యాజమాన్యంపై కఠిన చర్యలు తప్పవని పత్తికొండ ఆర్డిఓ భరత్ నాయక్ తెలిపారు. మంగళవారం ఆర్డిఓ కార్యాలయంలో గర్భస్థ పిండ పరీక్ష ప్రక్రియ - నియంత్రణ,దుర్వినియోగ నివారణ చట్టం -1994 పై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆర్‌డిఒ భరత్ నాయక్ మాట్లాడుతూ గర్భస్థ పిండి పరీక్షలు ప్రభుత్వ ,ప్రైవేటు, వైద్య సంస్థలు జన్యు సలహా కేంద్రాలు, జన్యు ప్రయోగాశాలలు, జన్యు చికిత్స కేంద్రాలు చట్టం ప్రకారం పరీక్షలు నిర్వహించాలన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే మూడు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.10000 జరిమానా విధిస్తామని అన్నారు. ఈ సమావేశంలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ నాగ ప్రసాద్ బాబు, జిల్లా మాస్ మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్ శెట్టి, పత్తికొండ సిఐ కులశేఖర్, లీగల్ అడ్వైజర్ వేణుగోపాల్, మైత్రి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు రామ్మోహన్, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ చంద్రశేఖర్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- సి బెళగల్

పండ్ల తోటల పెంపకం పై రైతులకు అవగాహన అవసరమని గ్రామాల్లో విస్తృతం చేయాలని డివిజన్ హార్టీకల్చరల్ అధికారి మధన్ మోహన్ పేర్కొన్నారు. మంగళవారం బ్రాహ్మణదొడ్డిలో గ్రామ హార్టీకల్చరల్ చెంచు రాజు సమక్షంలో పరిశీలన చేపట్టారు. ప్రభుత్వం ఉపాధి కింద కొబ్బరి, దానిమ్మ, నారింజ, సపోట, అరటి, జామ వంటి పండ్లు పండించుకోవడానికి తోడ్పాటునందిస్తుందని పేర్కొన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని, అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

రవీంద్రలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూల్ వెంకాయపల్లి రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మెరుగైన ఉపాధి కోసం నైపుణ్యాభివృద్ధి ద్వారా గ్రామీణ మహిళలను సాధికార పరిచే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని బ్రిటిష్ కౌన్సిల్, యుకెలోనిలోని టీసైడ్ విశ్వవిద్యాలయం, ఆర్‌ఎంజెఐటి సొల్యూషన్స్ నేతృత్వంలో నిర్వహిస్తున్నారు. నందనపల్లి, వెంకాయపల్లి పసుపల గ్రామీణ మహిళలు 100కుపైగా దరఖాస్తు చేసుకున్నారు. మహిళలకు సాఫ్ట్‌స్కిల్స్, పరిశ్రమల సంబంధిత నైపుణ్యాలు, ఆచరణాత్మక అనుభవం లాంటి నైపుణ్యాలను నేర్పిస్తారు. తద్వారా మహిళలు పరిశ్రమలలో ఉద్యోగాలు సులువుగా సంపాదించుకోవచ్చు. ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెఇ.శ్రీనివాసమూర్తి హాజరయ్యారు. ఆర్‌ఎంజెఐటి సొల్యూషన్స్ నేతృత్వంలో మహిళలకు తర్ఫీదునిస్తున్నందుకు అందులో భాగమైనందుకు తనకెంతో గర్వంగా ఉందని తెలిపారు. కార్యక్రమం వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జె.ఉషారాణి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఎంజెఐటి సొల్యూషన్స్ మేనేజర్, ట్రైనర్ హూపేస్ విద్యార్థులు పాల్గొన్నారు.

కాటికాపరి కుటుంబాన్ని ఆదుకోవాలి

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు

ప్రజాశక్తి - కౌతాళం

నివాళులర్పిస్తున్న నాయకులు

శ్మశానంలో గుంతలు తీసి పూడ్చే, కాల్చే కాటికాపరి వృత్తి నిర్వహించే కాటికాపరి చిన్న ఈరన్న కుటుంబాన్ని ఆదుకోవాలని కాటికాపరుల సంఘం రాష్ట్ర నాయకులు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. మంగళవారం కౌతాళం మండలం ఉరుకుంద గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన కాటికాపరి చిన్న ఈరన్న మృతదేహానికి ఆ సంఘం రాష్ట్ర నాయకులు ఆనంద్ బాబు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి.కరుణాకర్, డి.విజయ, సహాయ కార్యదర్శి చిన్న మారయ్య, మండల కార్యదర్శి వీరేష్, కెవిపిఎస్ మండల నాయకులు తాయప్ప, ఈరన్న, ఈరమ్మతో కలిసి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమాజంలో అన్ని రకాల ప్రజలు గౌరవంగా గుంత తీసి పూడ్చడమో, కర్రలు పేర్చి కాల్చడమో కాటికాపరులు చేస్తారని తెలిపారు. వారికి ఎలాంటి ఆసరా, అవకాశమూ లేక అనారోగ్యాల పాలై భార్య, పిల్లలను మరిన్ని కష్టాల్లోకి నెట్టేసి అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారని చెప్పారు. కాటికాపరి చిన్న ఈరన్న కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఇలాంటి దుర్భరమైన జీవితాలు గడుపుతున్న కాటికాపర్లందరినీ 4వ తరగతి ఉద్యోగులుగా నియమించాలని డిమాండ్ చేశారు.

రీ సర్వేపై సబ్ కలెక్టర్ ఆరా

ప్రజాశక్తి - మంత్రాలయం

ఆరా తీస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో ప్రభుత్వం సర్వే ప్రాజెక్టు కింద చేపట్టిన రీ సర్వేపై సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆరా తీశారు. మంగళవారం పైలెట్ ప్రాజెక్టుగా ఎన్నికైన సుంకేశ్వరి గ్రామంలో రీసర్వే గురించి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ ప్రక్రియపై గ్రామ సచివాలయంలో అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతుల ఫిర్యాదులను పరిశీలించి సమస్యలను పరిష్కరించారు. తహాశీల్దార్ రవి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీనివాస రాజు, మండల సర్వేయర్ అశోక్, విఆర్‌ఒలు ఆనందం, నరసప్ప, గ్రామ సర్వేయర్ తిమ్మేష్ పాల్గొన్నారు.

ఫారంపాండ్స్ పనులు వేగవంతం చేయాలి

- ఎంపిడిఒ అల్లా బకాష్, ఏపీడీ పకీరప్ప

ప్రజాశక్తి - చిప్పగిరి

సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ప్రతి పంచాయతీలోనూ ఫారంపాండ్స్ పనులను వేగవంతం చేయాలని ఎంపిడిఒ అల్లా ప్రకాష్, ఏపీడీ పకీరప్ప ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల కార్యాలయంలో ఏపీవో జుబేర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి పంచాయతీకి 20 ఫారంపాండ్స్ పనులను మంజూరు చేశామన్నారు. ఈ పనులన్నింటినీ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనులు చేసే దగ్గర తగిన సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆర్టికల్చర్ కింద మామిడి మొక్కలు పెంచే వారికి తగిన ప్రోత్సాహం ఉంటుందన్నారు. మొక్కలు కావాల్సిన రైతులు ఆర్టికల్చర్ అధికారులను సంప్రదించాలని తెలిపారు. ప్రతి గ్రామంలోనూ ఉపాధి హామీ పనులు చేసే వారి శాతం పెరగాలన్నారు. కొలతల ప్రకారం పనులు ఉండేలా ఉపాధి కూలీలు చూసుకోవాలని ఉపాధి కూలీలకు తెలిపారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పించే బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. ఉపాధి హామీ వేతనాలు కూడా పెండింగ్ లేకుండా వారి ఖాతాలకు జమ అవుతున్నాయన్నారు. డిప్యూటీ ఎంపిడిఒ బాలన్న పాల్గొన్నారు.

పాము కాటుకు గురైన ఉపాధి కార్మికుడు

ప్రజాశక్తి - నందవరం


పాము కాటుకు గురై, చికిత్స పొందుతున్న బజారి

నందవరం మండలం ముగితి గ్రామంలో ఉపాధి కార్మికుడు పాముకాటుకు గురయ్యారు. ఎంపిడిఒ పుల్లయ్య, ఏపీవో శ్రీనివాసులు వివరాల మేరకు... మంగళవారం ఉదయం ఉపాధి కూలీ బజారి పని చేస్తుండగా పాము కాటు వేసింది. ఆ విషయాన్ని సీనియర్ మేటీ అధికారులకు తెలపడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. బజారికి వైద్యులు చికిత్సను అందించారు. ప్రస్తుతం వైద్యుల సలహా మేరకు బజారిని ఇంటికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి మెరుగ్గా ఉంది.

కార్మిక వ్యతిరేక విధానాలు దుర్మార్గం

- కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అసమంజసమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు అజయ్ బాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు విమర్శించారు. ఆదోనిలో కార్మిక, కర్షక సంఘాలు చేపట్టిన నిరసన విజయవంతమైంది. మంగళవారం మున్సిపల్ మైదానం నుంచి భీమాస్ కూడలి వరకు ప్రదర్శన నిర్వహించి, నిరసన చేపట్టారు. ప్రయివేట్, కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూరేలా, ఊడిగం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పోరాడి సాధించుకున్న కార్మిక, కర్షక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించి కార్మికుల హక్కులను హరించే విధానాలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. రైతుల పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ప్రభుత్వ సంస్థల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ, ఆశా ఇతర స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. ప్రభుత్వ సంస్థలను కాపాడాలని, ఆ దిశగా ఉద్యోగ, కార్మిక సంఘాలు సంయుక్తంగా పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. సిఐటియు నాయకులు ఈరన్న, గోపాల్, తిప్పన, లింగన్న, లక్ష్మణ్, వీరేష్, వెంకటేష్, ఆటో డ్రైవర్ యూనియన్ నాయకులు హనుమంతు, రైతు సంఘం నాయకులు గోపాల్, లక్ష్మి రెడ్డి, అయ్యప్ప, కల్లుబావి రాజు, ఎఐటియుసి నాయకులు నాగరాజు, వెంకప్ప, షేక్షావలీ, ఐఎఫ్‌టియు నాయకులు మల్లికార్జున, మణి, వెంకప్ప, నేతప్ప ఉన్నారు. **ఆలూరు** అంబేద్కర్ సర్కిల్‌లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి, ఎఐటియుసి నాయకులు రామాంజినేయులు, రైతుసంఘం నాయకులు ఈరన్న, సిఐటియు నాయకులు కృష్ణ, నాగరాజు, శేఖర్, శ్రీనివాసులు, ఐద్వా నాయకులు గౌసియా, డివైఎఫ్‌ఐ నాయకులు మైనా, గోవర్ధన్ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరులో** సిఐటియు, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. తహశీల్దార్ కార్యాలయం నుంచి వైఎస్ఆర్, సోమప్ప సర్కిల్ వరకు 100 మందితో నిరసన చేపట్టారు. సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.గోవిందు, బి.రాముడు, అంగన్వాడీ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి బి.గోవర్ధనమ్మ, ఐఎఫ్‌టియు జిల్లా, తాలూకా నాయకులు పి.ప్రసాద్, కె.హనీఫ్, ఎస్.బాలరాజు, ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు ఎస్.రాజు, ఎం.సత్తన్న, బి.ఏసేపు మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను అమలు చేయాలని, కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ఎం.బతకన్న, లక్ష్మీ నరసయ్య, ఎం.అబ్దుల్లా, ఎ.సురేష్, యు.రమేష్, జయన్న, పి.రాజు, బాబు, ప్రతాప్, బి.కేశన్న, కె.ఇస్మాయిల్, ఎం.రామన్న, సుభాన్, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఎం.అరుణ, విజయమ్మ, పి.రాగమ్మ, బుట్టా శారద, రామలింగమ్మ, జైతున్, శంషు బేగం, సరోజ, ఈరమ్మ, పక్కీరప్ప, తాపీ కార్మిక సంఘం నాయకులు వి.తాయప్ప పాల్గొన్నారు. **కౌతాళం**లోని వాల్మీకి విగ్రహం సర్కిల్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సిపిఎం సీనియర్ నాయకులు కె.మల్లయ్య, మండల కార్యదర్శి ఈరన్న మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రయివేట్ రంగాన్ని అడ్డుకుంటామన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ, వ్యవసాయానికి సాగునీరందించి, కల్తీ విత్తనాలు, కల్తీ పురుగు మందులను నివారించి రైతులను ఆదుకోవాలని కోరారు. హనుమంతు, వీరేష్, శంకర్, బడేసా, వలీ, ఆంజనేయ, ఈరన్న పాల్గొన్నారు. **మంత్రాలయం** ఐసిడిఎస్ కార్యాలయం వద్ద నుంచి రాఘవేంద్ర సర్కిల్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. సీనియర్ అసిస్టెంట్ తినోద్ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. సిఐటియు నాయకులు హెచ్.జయరాజు, ఎఐటియుసి నాయకులు భాస్కర్ యాదవ్, భీమేశ్వరి, సిఐటియు నాయకులు ఎస్.వీరేష్, ఆంధ్రయ్య, అంజి, ప్రాణేష్, ఎఐవైఎఫ్ నాయకులు రాజు, సిపిఐ నాయకులు లక్ష్మన్న పాల్గొన్నారు. **హోళగుంద** తహాశీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టి, తహాశీల్దార్ నిజాముద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. రైతుసంఘం, సిఐటియు మండల కార్యదర్శులు వెంకటేష్, నాగరాజు, సిఐటియు నాయకులు రామాంజనేయులు, రైతు సంఘం నాయకులు కిష్టప్ప, రవి, విఆర్‌ఎ మౌలాలి, సోమలింగ, హమాలీ నాగరాజు, ఈరన్న, సిద్ధలింగ, గాదిలింగ పాల్గొన్నారు. **కోసిగి**లో నిరసన చేపట్టారు. సిఐటియు మండల కార్యదర్శి రాముడు, రైతుసంఘం మండల నాయకులు వీరేష్, పూజారి శ్రీనివాసులు, ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటమ్మ, సుజాత, ఆటో యూనియన్ నాయకులు వెంకటేశ్వర్లు, శ్రీను, నాగలింగ, నరసింహులు, వ్యకాస నాయకులు వీరేష్ పాల్గొన్నారు.

ఆదోనిలో నిరసన చేపడుతున్న నాయకులు

ఆలూరులో...

ఎమ్మిగనూరులో

కౌతాళంలో...

కోసిగిలో...

మంత్రాలయంలో...

హోళగుందలో...

టిడిపితోనే ప్రజా రంజక పాలన

- ఎమ్మెల్యే బీవీ, ఎంపీ నాగరాజు - ఘనంగా మినీ మహానాడు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్రంలో టిడిపి ప్రజా రంజక పాలన సాధ్యమని, పార్టీ పటిష్టతకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ఎమ్మిగనూరు నియోజకవర్గ మినీ మహానాడు స్థానిక కుర్ని కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. మొదట పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సభా వేదికపై పార్టీ వ్యవస్థాపకులు కీర్తిశేషులు ఎన్‌టి.రామారావు, మాజీ మంత్రి బీవీ.మోహన్ రెడ్డి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నారని తెలిపారు. వైసిపి విమర్శలను తిప్పి కొట్టాలని చెప్పారు. రాష్ట్రంలో ఎన్నో క్లిష్ట పరిస్థితులు ఉన్నప్పటికీ పింఛన్లను 1వ తేదీన అందిస్తున్నట్లు తెలిపారు. నాయకులు బందే నవాజ్, తురేగల్ నజీర్ అహ్మద్, రంగస్వామి గౌడ్, అల్తాఫ్, టౌన్ బ్యాంకు ఛైర్మన్ ఉరుకుందయ్య శెట్టి, వైస్ ఛైర్మన్ బండ నరసప్ప, ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ కురువ మల్లయ్య, కురువ సాధికారిక కర్నూలు పార్లమెంటు కమిటీ మెంబర్ కెటి.వెంకటేష్, కురువ సంఘం రాష్ట్ర నాయకులు కె.మద్దిలేటి, మండల మాజీ అధ్యక్షులు పార్లపల్లి మల్లికార్జున, మాజీ ఉపాధ్యక్షులు అయ్యాలప్ప, బనవాసి కురువ కృష్ణ, నరసింహులు, కురువ ధనుంజయ, సోమేష్ రెడ్డి పాల్గొన్నారు.

మినీ మహానాడులో పాల్గొన్న నాయకులు

వ్యవసాయానికి రైతులు సిద్ధం

- విత్తన కొనుగోలులో జాగ్రత్త
- పత్తి లూజు విత్తనాలు కొనవద్దు
- విత్తన ఎంపికలో ఎడిఎ ఖాద్రీ సలహాలు, సూచనలు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గత రెండు, మూడు రోజులుగా మండలంలో వర్షాలు కురుస్తున్నాయి. రైతులు పొలాలను పంటల సాగుకు సిద్ధం చేస్తున్నారు. మరి కొంతమంది రైతులు బోర్లు, బావులు లాంటి నీటి వసతులున్న చోట ముంగారి పత్తి సాగుకు సిద్ధమవుతున్నారు. పంట సాగులో కీలక భూమిక పోషించే విత్తనాల కొనుగోళ్లలో నిమగ్నమయ్యారు. సరయిన విత్తనాలు ఎంపిక చేసుకోలేకపోతే రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది.

ఈ మేరకు విత్తనాల కొనుగోలు విషయంలో రైతులకు తగిన జాగ్రత్తలు పాటించాలని ఎమ్మిగనూరు ఎడిఎ మహ్మద్ ఖాద్రీ సూచిస్తున్నారు. లూజు విత్తనాలు అమ్మే దళారులు మోసం చేసేందుకు సిద్ధంగా ఉన్నందున అప్రమత్తంగా వ్యవహరించాలని పేర్కొంటున్నారు. లూజు విత్తనాలు కాకుండా ప్యాకెట్లలో ఉన్నవే కొనుగోలు చేస్తే మేలని చెబుతున్నారు.

లూజు విత్తనాలతో నష్టం

ప్యాకెట్లలో కాకుండా విడిగా కొనుగోలు చేసే విత్తనాల్లో నాణ్యత ఉండదు. ఈ విత్తనాల తయారీలో కంపెనీ వారి, ధ్రువీకరణ అధికారుల ప్రమేయం ఉండదు. లూజు విత్తనాలు కొనుగోలు చేసిన సమయంలో ఎటువంటి బిల్లునూ ఇవ్వరు. ప్రాసెసింగ్, శుద్ధి ఇతర ప్రమాణాలు ఉండవు. ఈ విత్తనాలు విత్తినప్పుడు, పంట మధ్య కాలంలో పూత, కోత దశలో ఏమైనా నష్టాలు జరిగితే రైతులకు న్యాయం జరగదు. ఈ విత్తనాలకు జన్యు నాణ్యత ఉండదు. ఈ విత్తనాలు దళారులు రైతులను మోసం చేసే వారు మాత్రమే విక్రయిస్తారు.

కంపెనీ ప్యాకెట్ల విత్తనాలతో రైతుకు మేలు

కంపెనీల ద్వారా సీల్ ప్యాకెట్లలో అమ్మే విత్తనాలు పూర్తి నాణ్యమైనవి అయి ఉంటాయి. ఈ విత్తనాల తయారీలో వివిధ దశల్లో కంపెనీవారు, ధ్రువీకరణ అధికారులు పాల్గొంటారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో బిల్లు తప్పకుండా ఇస్తారు. విత్తన తయారీ ప్రాసెసింగ్, శుద్ధి ఇతర నాణ్యత ప్రమాణాలు పాటిస్తారు. ఈ విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులకు బిల్లు ఇస్తారు. తర్వాత ఏమైనా నష్టం జరిగితే పరిహారం అందుకునే వీలుంటుంది. ఈ విత్తనాలకు కచ్చితంగా జన్యు నాణ్యత కూడా ఉంటుంది. ఈ విత్తనాలను వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్సు పొందిన డీలర్లు విక్రయిస్తారు. లైసెన్సు పొందిన డీలర్ల వద్దే ఖరీఫ్‌లో పంట సాగు చేసే రైతులు.. వ్యవసాయ అధికారుల నుంచి లైసెన్సు పొందిన డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేయాలి. తర్వాత దుకాణదారులు నుంచి తప్పక రశీదు తీసుకోవాలి. పంట కాలం పూర్తయ్యే వరకు వాటిని భద్రంగా దాచి ఉంచాలి. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు లూజు విత్తనాలు విక్రయించడానికి వస్తే కొనుగోలు చేయవద్దు. లూజు విత్తనాలు విక్రయించడానికి వచ్చిన వారి సమాచారాన్ని వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయాలి. విత్తన కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటిస్తే పంట సాగుకు ముందే జరిగే కొన్ని నష్టాలు అన్నదాతలు నివారించుకోవచ్చు.

ఎడిఎ మహ్మద్ ఖాద్రీ

లైసెన్సుడు డీలర్ దుకాణంలోని విత్తనాలు

గుండెపోటుతో శ్రీమఠం ఉద్యోగి మృతి

ప్రజాశక్తి - మంత్రాలయం

నరసింహ చార్ (ఫైల్)

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో పరిచారికగా పనిచేస్తున్న కౌతాళం నరసింహ చార్ (57) గుండె పోటుతో మృతి చెందారు. సోమవారం రాత్రి అస్వస్థతకు గురైన ఆయనను ఎమ్మిగనూరు పట్టణంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. లో బీపీ, లో షుగర్ కారణంగా చికిత్స పొందుతున్న నేపథ్యంలో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలిస్తుండగా గుత్తి సమీపంలో గుండె పోటుతో మరణించినట్లు మంగళవారం బంధువులు తెలిపారు. శ్రీమఠంలో పనిచేస్తున్న పర్మినెంటు ఉద్యోగిగా తగిన గుర్తింపు పొందిన ఆయన మరణం బాధాకరమని శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థులు, ఎఎఒ మాధవ శెట్టి, మేనేజర్లు వెంకటేష్ జ్యోషి, సురేష్ కోనాపూర్, ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతి ఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, సూపరింటెండెంట్ పురాణిక అనంతాచార్, ద్వార పాలక అనంతస్వామి, సహాయక పిఆర్‌ఒ హొన్నొళ్లి వ్యాసరాజాచార్‌లు బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మండల పదవి లింగాయత్‌లకు ఇవ్వాలి

- టిడిపి నాయకులు బసవన్న గౌడ్

ప్రజాశక్తి - హాలహర్వి

టిడిపి కన్వీనర్ పదవి లింగాయత్‌లకు ఇవ్వాలని టిడిపి బసవన్న గౌడ్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడారు. ప్రతిసారీ ఎన్నికల్లో పార్టీ అభివృద్ధికి, పార్టీ బలోపేతం కోసం లింగాయత్‌లు కృషి చేస్తున్నారని తెలిపారు. వారు ఇప్పటివరకు మండలంలో ఎలాంటి ఉన్నత పదవులూ పొందలేదని చెప్పారు. టిడిపి అధిష్టానం ఆలోచించి టిడిపి కన్వీనర్‌గా వీరశైవ లింగాయత్ సామాజిక వర్గానికి చెందిన వారికి ఇవ్వాలని కోరారు. హాలహర్విలో ఇప్పటివరకు బోయలకు మండల పార్టీ బాధ్యతలు అప్పగించారని, మండల పార్టీ పదవిని లింగాయత్‌లకు ఇచ్చి సామాజిక న్యాయం చేయాలని తెలిపారు. లింగాయత్‌లకు మండల కన్వీనర్ పదవిని కేటాయిస్తే, మండలంలో అన్ని వర్గాలను కలుపుకుని పోతూ, వచ్చే పంచాయతీ, అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని చెప్పారు.

ఘనంగా ఎన్‌టిఆర్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - కోసిగి

కోసిగిలో కేకట్ కట్ చేస్తున్న అభిమానులు

స్థానిక కొండగేని కాలనీలో ఎన్‌టి.రామారావు 42వ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం అభిమానులు డీలర్ నరసన్న, గాలం వీరేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కీర్తిశేషులు నందమూరి తారక రామారావు మనవడిగా తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారని తెలిపారు. ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంతో ప్రపంచ వ్యాప్తంగా అభిమానులను సంపాదించుకుని ఎనలేని కీర్తి పొందారని చెప్పారు. రాబోయే రోజుల్లో మరిన్ని మంచి చిత్రాలు, సందేశాత్మక చిత్రాలు తీసి అభిమానుల మన్ననలు పొందాలని ఆశాభావం వ్యక్తం చేశారు. నందమూరి అభిమానులు బసప్ప, నారాయణ, ఇమ్రాన్, మొబైల్ రాజు, కెబి.నరసన్న, రామాంజనేయులు, దుబ్బయ్య పాల్గొన్నారు.

తాతకు తగ్గ మనవడు ఎన్‌టిఆర్

ఆదోని : సినీ ఇండస్ట్రీలో తాతకు తగ్గ మనవడిగా ఎన్‌టిఆర్ పేరు ప్రఖ్యాతలు పొందారని ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ రాష్ట్ర కన్వీనర్ కెఎం.ముజీబ్ అహ్మద్ పేర్కొన్నారు. ఎన్‌టిఆర్ పుట్టినరోజు వేడుకలను ముజీబ్ అహ్మద్ ఆధ్వర్యంలో అభిమానులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి తమ అభిమాన నటుడికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆదోని ప్రజా బ్లడ్ బ్యాంకులో అభిమానులు రక్తదానం చేశారు. అనంతరం ఎన్‌టిఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, రక్తదానం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అభిమానులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేశారు. అంతకుముందు మాజీ కౌన్సిలర్, టిడిపి నాయకులు తిమ్మప్ప, మైనార్టీ నాయకులు ఎగ్బాల్ సమక్షంలో భారీ కేక్ కట్ చేశారు. రక్తదానం చేసిన వారికి జ్ఞాపకార్థంగా ఎన్‌టిఆర్ బొమ్మ ఉన్న ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. బ్లడ్ బ్యాంకు మేనేజర్ బాబు, సిబ్బంది రమేష్, తదితరులను పూలమాల, శాలువాతో సన్మానించారు. ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ చాంద్, నవీన్, శంకర్, నాగరాజ్, బుజ్జి ఉన్నారు.

ఆదోనిలో రక్తదానం చేస్తున్న అభిమానులు

నా సత్తా ఏమిటో బాబుకు తెలుసు

- టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

టిడిపి స్థాపన నాటి నుంచి పార్టీ వెంట నడిచిన తన నిబద్ధత, సత్తా ఏమిటో అధినేత చంద్రబాబుకు తెలుసని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు తెలిపారు. మంగళవారం పట్టణంలోని జెబి గార్డెన్స్‌లో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో కలిసి మినీ మహానాడు నిర్వహించారు. కర్నూలు ఎంపీ నాగరాజు, టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి, పార్టీ నియోజకవర్గ అబ్జర్వర్ ధర్మవరం సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మీనాక్షి నాయుడు మాట్లాడారు. పార్టీ పిలుపు ఇచ్చిన ఏ కార్యక్రమమైనా నియోజకవర్గంలో వందలాది మందితో దిగ్విజయం చేయడం తమ నైజమన్నారు. ఎన్నికలకు ముందు నియోజకవర్గం వచ్చిన చంద్రబాబు పర్యటనకు కనీవిని ఎరుగని రీతిలో జనాన్ని సమీకరించి అబ్బురపరిచామని తెలిపారు. తక్కువ సమయంలోనే కార్యక్రమ దిగ్విజయం గురించి స్వయానా చంద్రబాబు పలు మీటింగుల్లో ప్రశంసిస్తూ మెచ్చుకున్న విషయాన్ని గుర్తు చేశారు. పదవి ఉన్నా, లేకున్నా ఊపిరి ఉన్నంత వరకు టిడిపిలోనే కొనసాగుతామన్నారు. ఎన్ని ప్రలోభాలూ, పదవుల ఆశలు చూపినా పార్టీ మారలేదని, కష్ట సమయాల్లో కూడా కార్యకర్తలు తమ వెంట నడిచారని భావోద్వేగానికి లోనయ్యారు. మినీ మహానాడుకు కొందరు నాయకులు రాకపోవడం సమంజసం కాదని, అది వారి విజ్ఞతకే వదిలేయాలని తెలిపారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి మాట్లాడుతూ... టిడిపికి కార్యకర్తలే బలమని తెలిపారు. మీనాక్షి నాయుడు నీడలోనే ఎదిగిన నాయకులు ఆయన నాయకత్వంతో విభేదించడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా ఒకే తాటిపైకి రావాలని విజ్ఞప్తి చేశారు. కురువ కార్పొరేషన్ ఛైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, నాయకులు ఉమాపతి నాయుడు, మారుతి నాయుడు, కౌన్సిలర్ పార్వతి, శ్రీకాంత్ రెడ్డి, ఉమ్మి సలీం, వెంకటష్ చౌదరి, తిమ్మప్ప, అయ్యన్న, వెంకటేష్, జెబి.రంగన్న, అప్సర బాషా, బసవరాజు, బుద్ధారెడ్డి, గిడ్డి మల్లి, రామస్వామి, రామకృష్ణ పాల్గొన్నారు.

పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీ నాగరాజు, టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి

మహారాజశ్రీ
మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.పి. నెం: 8/2025
తడికమళ్ల పద్మావతి ... పిటీషనరు
వర్సెస్
1) కాలంగి చలమారావు మరియు ఇతరులు .... రెస్పాండెంట్లు
టు,
ఆర్-2: కొండేపల్లి శిరీషారాణి,
భర్త: డి.రామక్రిష్ణ,
డోర్ నెం: 80-06-811,
అబ్బాస్ నగర్, ఎస్‌బిఐ ఎదురు,
క్రిష్ణా నగర్, కెనాల్ క్యాంపు-బి,
కర్నూలు సిటీ, కర్నూలు జిల్లా.

పై నెంబరు ఐ.పి.లోని, పిటీషనరు ఐ.పి. లోని 1వ రెస్పాండెంట్ పిటీషనర్‌కు బాకీ ఉన్న కారణం చేత పిటీషనర్ ఐ.పి. షెడ్యూలు దాఖలా ఆస్తిని బాకీ ఎగవేత కొరకు 2వ రెస్పాండెంట్‌కు ఐ.పి. షెడ్యూలు దాఖలా ఆస్తిని అమ్మి యున్నారు. కనుక పిటీషనర్ మీపై క్రెడిటార్ ఐ.పి. వేసియున్నది. ఇందు విషయమై నీకు నోటీసులు పంపగా తీసుకొనకుండా కాలాయాపన చేయుచున్నావు. ఈ దినపత్రిక నోటీసు ద్వారా నీకు తెలియజేయునది ఏమనగా 17-06-2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో మీరు స్వయముగా లేదా మీ అడ్వకేట్ ద్వారా గానీ హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకొనవలసినది. లేని యెడల నీ పరోక్షమందు ఐ.పి.ని విచారించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వులతో //
వాయిదా: 17-06-2025
మార్కాపురం
గెల్లి చౌడేశ్వరరావు,
పిటీషనరు తరపు అడ్వకేట్.
సెల్: 9985009542.

విజేతలకు బహుమతులు పంపిణీ

ప్రజాశక్తి - నందవరం

బహుమతులు అందజేస్తున్న నాయకులు

నందవరం మండలం కనకవీడు గ్రామంలో వెలసిన శ్రీమహాయోగి తిక్క లక్ష్మమ్మ అవ్వ జాతర సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గెలుపొందిన వారికి మంగళవారం టిడిపి యువ నాయకులు బహుమతులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ... క్రీడారంగంలో ముందుకెళ్లాలనే ఆశయం ఉన్నవారికి సహాయ, సహకారాలు అందిస్తామని చెప్పారు. గెలుపొందిన ఎన్‌టిఆర్ యూత్, బిజి.శివ టీమ్, సోమ నాయుడు టీమ్‌కు మొదటి బహుమతి రూ.10,016, రెండో బహుమతి రూ.6,016, మూడో బహుమతి రూ.4,016 అందజేశారు. టిడిపి నాయకులు డబ్బా ఈరన్న, హను మంతు, మాన్ దొడ్డి వీరన్న, డీలర్ మునుస్వామి, డీలర్ నరసింహులు, డీలర్ దుబ్బన్న, రామలింగప్ప, శాస్త్రి, రాంబాబు, మినుగు ఈరన్న, మల్లయ్య, ఈరన్న, కోటి, రాముడు, నాయుడు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి మాజీ ముఖ్యమంత్రి జగన్ : వైసిపి

ప్రజాశక్తి - నందవరం

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేదల పక్షపాతి అని వైసిపి రాష్ట్ర బీసీ సెల్ నాయకులు విరుపాక్షి రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వానికి పేదపై ప్రేమ లేదని, పేదలను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. టిడిపి నిర్లక్ష్యంతో వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌ను మూసేశారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో గత వైసిపి ప్రభుత్వం 10 వేలకు పైగా హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి, సుమారు 3 వేల జనాభా ఉన్న ప్రతి గ్రామానికీ ఒక వైద్య కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కరోనా సమయంలో క్లినిక్‌ల ద్వారా ప్రజలకు విశేష సేవలను అందించామని తెలిపారు. ఏప్రిల్ 24, 2025న హెల్త్ క్లినిక్స్‌లో పని చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పిలు వేతనాలు, ఇన్సెంటివ్స్ విడుదలకు వేటు పడడంతో సమ్మె నిర్వహిస్తున్నారని చెప్పారు. సమ్మె కారణంగా వైద్య కేంద్రాలు మూతపడడం, గ్రామీణ ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందకపోవడం బాధాకరమని తెలిపారు. పేద, మధ్య తరగతి ప్రజలు ప్రయివేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటి వరకు ఎంఎల్‌హెచ్‌పిల సమస్యలు పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. వారి వేతనాలు, ఇన్సెంటివ్స్ చెల్లించి వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను తిరిగి ప్రారంభించాలని కోరారు. వైసిపి మండల ఉపాధ్యక్షులు రాఘవరెడ్డి, మల్లికార్జున, భీముడు, హుస్సేని పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విరుపాక్షిరెడ్డి

బ్యాంక్ ఆఫ్ ఇండియా
Bank of India
Relationship beyond banking
కర్నూలు మెయిన్ బ్రాంచి, కర్నూలు. ఫోన్: 08518-257628

విషయము: గడువు ముగిసిన లాకర్ అద్దె చెల్లింపుకు నోటీసు

వ. నెం.	లాకర్ హోల్డర్ యొక్క పేరు & చిరునామా	గడువు ముగిసిన లాకర్ అద్దె	పంపిన నోటీసుల వివరాలు	గడువు దాటిన తేది
1	శ్రీ కాంచనం గోపాల్ & కె.శ్రీనివాసప్రసాద్, తండ్రి: కెసి బొజ్జన్న, హెచ్.నెం. 40-814-1, శ్రీనివాస నగర్, టెలిఫోన్ మెయిన్ ఆఫీస్ దగ్గర, కర్నూలు-518001. లాకర్ నెం.136-F	రూ. 45,950/-	22-06-2020 16-01-2021 06-03-2021 14-06-2023 08-02-2024 15-10-2024 10-12-2024	15-03-2020

"పైన పేర్కొన్న లాకర్ హోల్డర్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కర్నూల్ మెయిన్ బ్రాంచ్‌లో లాకర్‌ను నిర్వహిస్తున్నారు. మేము పై పట్టికలోని కాలమ్ 4లో పేర్కొన్న తేదీలలో గడువు దాటిన లాకర్ అద్దె చెల్లింపుకు సంబంధించి వివిధ సమాచారాలను పంపినాము. అయినా, ఎన్ని రిమైండర్లు పంపినప్పటికీ అద్దె చెల్లింపు జరగలేదు. ఈ నోటిఫికేషన్ ప్రచురించిన 15 రోజులలోపు పైన పేర్కొన్న పట్టికలోని కాలమ్ నెం.3లో పేర్కొన్న గడువు ముగిసిన అద్దెను డిపాజిట్ చేయాలని లాకర్ హోల్డర్‌కు మరోసారి సూచించడమైనది. చెల్లింపు జరగని సందర్భంలో, ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 15 రోజుల తర్వాత బ్యాంకు వారు (లాకర్-హోల్డర్ల ఖర్చు), ఖర్చులు మరియు ఛార్జీలతో పూర్తిగా వారి బాధ్యతతో లాకర్‌ను తెరువబడునని తెలియజేయడమైనది.

తేది: 20-05-2025, ప్రదేశము: కర్నూలు సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ ఇండియా